


వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం బుధవారం అట్టహాసంగా జరిగింది. ఒంగోలులోని విష్ణుప్రియ ఫంక్షన్ హాల్లో పార్టీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్చార్జ్, మాజీ మంత్రి మేరుగు నాగార్జున ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి, ఒంగోలు నియోజకవర్గ ఇన్చార్జి చుండూరి రవిబాబు, తదితరులు పాల్గొని మాట్లాడారు. అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు పాల్గొనగా, నియోజకవర్గంలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి నివాళులర్పించారు. బూచేపల్లి, మేరుగు, బత్తుల, చుండూరిలను ఘనంగా సన్మానించారు.

- సాక్షి, ఒంగోలు

భారీగా తరలిన వైఎస్సార్ సీపీ శ్రేణులు

చీమకుర్తి రూరల్: ఒంగోలులోని విష్ణుప్రియ ఫంక్షన్ హాల్లో బుధవారం నిర్వహించిన వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశానికి చీమకుర్తి మండలం నుంచి ఆ పార్టీ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. పార్టీ సాంస్కృతిక విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు మక్కెన రాజేంద్ర కుమార్ ఆధ్వర్యంలో డప్పు కళాకారుల వాయిద్యాలతో స్వాగతం ప్రత్యేక ఆకర్షణగా నిలవగా, పార్టీ చీమకుర్తి మండల అధ్యక్షుడు పమిడి వెంకటేశ్వర్లు, జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు చీదర్ల శేషు, యన్నం శేషురెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు ఎస్.వెంగారెడ్డి, స్టూడెంట్ విభాగం అధ్యక్షుడు ఎస్.వెంకటరావు, గంగిరెడ్డి, ఓబులరెడ్డి, చిన్నపురెడ్డి మస్తాన్‌రెడ్డి, బొడ్డు కోటేశ్వరరావు, కుంచాల రాంబాబు, కత్తి రమణారెడ్డి, ఏలూరి సుబ్బారావు, సంతోష్, మాలకొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ కంపెనీలకు దాసోహం


సంతనూతలపాడులో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి సుబ్బారావు


చీమకుర్తి మెయిన్‌రోడ్డులో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు, కార్మికులు


నాగులుప్పలపాడులో నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

- కార్మికులకు అన్యాయం
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై కార్మిక సంఘాల నాయకుల ధ్వజం
- దేశవ్యాప్త సమ్మెలో భాగంగా సంతనూతలపాడు, ఒంగోలు నియోజకవర్గాలలో నిరసన ర్యాలీలు

సంతనూతలపాడు: కార్పొరేట్ కంపెనీలు, సంస్థలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దాసోహమవుతూ దేశ సంపదను వారికి దోచిపెడుతున్నాయని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బంకా సుబ్బారావు విమర్శించారు. కార్మిక సంఘాలు తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెలో భాగంగా సంతనూతలపాడులో బుధవారం నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. అంబానీ, అదానీ లాంటివారి కార్పొరేట్ కంపెనీలకు దేశ సంపదను దోచిపెట్టడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోటీపడుతున్నాయన్నారు. ప్రజా సంక్షేమ రంగాన్ని గాలికొదిలేశారని, కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న ఎనిమిది గంటల పని విధానాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్రలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించిన టీడీపీ.. అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని బిగించేందుకు శ్రీకారం చుట్టారన్నారు. ముందుగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు నెరుసుల వెంకటేశ్వర్లు, రైతు సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు అబ్బూరి వెంకటేశ్వర్లు, సీపీఎం మండల కార్యదర్శి కిలారి పెద్దబ్బాయి, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ మద్దిపాడు ప్రాజెక్ట్ కార్యదర్శి ఎం.ధనలక్ష్మి, అంగన్‌వాడీ నాయకులు ఎస్‌కే మీరాబీ, లక్ష్మీపద్మ, ఆశావర్కర్లు సుభాషిణి, కృష్ణవేణి, రైతు సంఘ మండల అధ్యక్ష కార్యదర్శులు ఎన్వీ నరసింహం, కే హనుమంతరావు, సీఐటీయూ, ఐద్వా నాయకులు పాల్గొన్నారు.

చీమకుర్తిలో కదంతొక్కిన కార్మికులు...

చీమకుర్తి: దేశవ్యాప్త సమ్మెలో భాగంగా చీమకుర్తిలో బుధవారం కార్మిక సంఘాలు రోడ్డెక్కాయి. చీమకుర్తి మెయిన్‌రోడ్డులో వందలాది మంది కార్మికులతో నిరసన ర్యాలీ నిర్వహించారు. బ్రిటీష్ కాలం నుంచి కార్మిక సంఘాలు సాధించుకున్న చట్టాలను మోదీ ప్రభుత్వం రద్దు చేయడంపై కార్మిక సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు సంఘ జిల్లా కార్యదర్శి పమిడి వెంకట్రావు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి కాలం సుబ్బారావు పాల్గొని కార్మికులనుద్దేశించి మాట్లాడారు. కార్మికులను కట్టుబానిసలుగా మార్చే లేబర్స్ కోడ్స్‌ను కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు, కనీస పింఛను రూ.10 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపాధి కూలీలకు రోజు కూలి రూ.600 ఇవ్వాలని, ఉపాధి హామీ పథకాన్ని పట్టణాలకు విస్తరింపజేయాలని కోరారు. తొలుత చీమకుర్తి మెయిన్‌రోడ్డులోని ఎస్ఎస్‌పీ కాలనీ నుంచి స్టేట్ బ్యాంక్ వరకు సీఐటీయూ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ, ఇతర అనుబంధ సంఘాల నాయకులు పూసపాటి వెంకట్రావు, పల్లాపల్లి ఆంజనేయులు, వీరాంజనేయులు, ఓబులేసు, కనకరాజు, అప్పలనాయుడు, స్థానికులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్లు రద్దు చేయాలి...

నాగులుప్పలపాడు: దేశవ్యాప్త సమ్మెలో భాగంగా సీఐటీయూ ఆధ్వర్యంలో నాగులుప్పలపాడు బస్టాండ్ సెంటర్లో ధర్నా నిర్వహించారు. సీఐటీయూ మండల కార్యదర్శి జి.బసవ పున్నయ్య, కౌలు రైతు సంఘ జిల్లా సహాయ కార్యదర్శి టి.శ్రీకాంత్ మాట్లాడుతూ రైతాంగానికి వ్యతిరేకంగా తీసుకొచ్చిన నల్లచట్టాలకు వ్యతిరేకంగా రైతాంగం సంవత్సరం పాటు చేసిన పోరాటంతో దిగివచ్చిన కేంద్ర ప్రభుత్వం వాటిని రద్దు చేసిందన్నారు. కానీ, తిరిగి దొడ్డిదారిన అమలు చేయడానికి పూనుకుంటున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లేబర్ కోడ్లను రద్దు చేయకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల అధ్యక్షుడు ఎస్.రామారావు, నాయకులు కాకాని సుబ్బారావు, సొసైటీ సీఈఓ రమేష్, పంచాయతీ కార్మికులు, రైతులు, వివిధ ప్రజాసంఘాల నాయకుల పాల్గొన్నారు.

ఏపీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో...

ఒంగోలు సిటీ: కార్మికులను బానిసలుగా మార్చే నాలుగు లేబర్ కోడ్లను కేంద్ర ప్రభుత్వం రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (ఏపీడబ్ల్యూజేఎఫ్) జిల్లా కమిటీ నేతలు డిమాండ్ చేశారు. కార్మిక సంఘాల దేశవ్యాప్త సమ్మెకు మద్దతుగా ఒంగోలు కలెక్టరేట్ వద్ద బుధవారం జర్నలిస్టులతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. జర్నలిస్టుల వేతన చట్టం 1958ని, వర్కింగ్ జర్నలిస్టుల చట్టం 1955ని పునరుద్ధరించాలని ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా మాజీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గొట్టిపాటి నాగేశ్వరరావు, ఎస్‌వీ బ్రహ్మం డిమాండ్ చేశారు. పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

కొత్తపట్నంలో...

కొత్తపట్నం: మండల కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం ర్యాలీ నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టారు. సీఐటీయూ మహిళా సంఘ జిల్లా కార్యదర్శి కె.రమాదేవి, సీఐటీయూ మండల కార్యదర్శి సూరిని స్వామిరెడ్డి, పి.పద్మ, నిర్మల, వెంకాయమ్మ, భూలక్ష్మి, నాగమల్లేశ్వరి, కృపసోమరాజులు, బ్రహ్మయ్య, కోటేశ్వరరావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సమస్యలుంటే గ్రామ సహాయకులను సంప్రదించండి

సంతనూతలపాడు: మండలంలోని రైతులు అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించిన సమస్యలుంటే వెంటనే గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని మండల వ్యవసాయ అధికారిణి పి.పావని సూచించారు. అర్హులైన రైతులందరినీ అర్హుల జాబితాలోకి తేవడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్లో కౌలుకి సాగుచేస్తున్న రైతులందరూ గ్రామ వ్యవసాయ సహాయకులను, గ్రామ రెవెన్యూ అధికారులను సంప్రదించి తప్పనిసరిగా సీసీఆర్సీ కార్డు (కౌలు కార్డు) పొందాలని తెలిపారు. 2025 ఖరీఫ్ సీజన్లో పంటలు సాగుచేస్తున్న రైతులకు ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకం వర్తించాలంటే తప్పనిసరిగా కామన్ సర్వీస్ సెంటర్లో (సీఎస్సీ సెంటర్)గానీ, సచివాలయంలోని డిజిటల్ అసిస్టెంట్ వద్దగానీ ప్రస్తుతం రైతులు సాగుచేస్తున్న పంటలకు ప్రీమియం చెల్లించాలని తెలిపారు.

క్విస్ ఎన్‌సీసీ క్యాడెట్లకు బీ సర్టిఫికెట్లు


సర్టిఫికెట్లు అందుకున్న క్విస్ ఎన్‌సీసీ క్యాడెట్లు

ఒంగోలు సిటీ: స్థానిక క్విస్ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన 40 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు ప్రతిభ కనబరిచారు. బీ సర్టిఫికెట్ రాత పరీక్షకు హాజరైన 40 మంది ఏ - గ్రేడ్‌లో ఉత్తీర్ణత సాధించి బీ సర్టిఫికెట్లు పొందారు. 34వ ఆంధ్రా బెటాలియన్ ఒంగోలు క్యాడెట్లకు ఈ సర్టిఫికెట్లు అందించారు. ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన క్యాడెట్లు సీ - సర్టిఫికెట్‌కి అర్హత పొందుతారు. బీ సర్టిఫికెట్ పొందిన క్యాడెట్లు అగ్నివీర్ ద్వారా ఆర్మీలో చేరేందుకు అవకాశం ఉంటుంది. బోనస్ పాయింట్లు వచ్చి ఆర్మీలో ఉద్యోగాలు సాధించేందుకు ఉపయోగపడుతుందని ఎన్‌సీసీ విభాగాధిపతి రమణయ్య తెలిపారు. సర్టిఫికెట్లు సాధించిన క్యాడెట్లను క్విస్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ డాక్టర్ నిడమానూరి శ్రీగాయత్రి అభినందించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై.వి.హనుమంతరావు, హెచ్‌ఓడీలు, డీన్‌లు, డైరెక్టర్లు శుభాకాంక్షలు తెలిపారు.

ఓటరు నమోదుకు సహకరించండి


నాయకులు, తహసీల్దార్లతో మాట్లాడుతున్న ఎన్నికల అధికారి వరకుమార్

చీమకుర్తి: ఓటరు నమోదు కార్యక్రమానికి రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి ఎస్.వరకుమార్ కోరారు. బుధవారం చీమకుర్తి రెవెన్యూ కార్యాలయంలో నియోజకవర్గంలోని పలు రాజకీయ పార్టీల నాయకులతో పాటు నాలుగు మండలాల తహసీల్దార్‌లు, బీఎల్‌ఓలు, బీఎల్‌ఏలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వరకుమార్ మాట్లాడుతూ ఆధార్ సీడింగ్‌ను పూర్తి చేయటం, నూతన ఓటర్లను చేర్పించటం, తొలగింపులను పర్యవేక్షించటం వంటి కార్యక్రమాలలో బీఎల్‌ఓలకు నాయకులు సహకరించాలని కోరారు. తొలుత ఉదయం బీఎల్‌ఓలకు జరిగిన ఓటరు నమోదు కార్యక్రమంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్‌లు ఆర్.బ్రహ్మయ్య, ఎస్ఎల్ఎన్ నారాయణరెడ్డి, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

కనీస వేతనం అమలు చేయాలి


మద్దిపాడులో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

మద్దిపాడు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కనీస వేతనం అమలు చేయాలని, పని గంటలను 8 నుంచి పది గంటలకు పెంచిన జీవోలను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు డిమాండ్ చేశారు. దేశవ్యాప్త సమ్మెలో భాగంగా బుధవారం మద్దిపాడు తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. మహిళలను రాత్రి షిఫ్టులలో పనిచేయించడం లాంటి జీవోలను తెచ్చిన కూటమి ప్రభుత్వ చర్యలను ప్రజలంతా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కార్పొరేట్ కంపెనీల ప్రయోజనాల కోసమే పనిచేస్తోందన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులు, చట్టాలను రద్దు చేసి కార్మిక కోడ్లు తెచ్చిందన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఎస్.కె.ఖాశిం, రైతు సంఘ నాయకులు కనపర్తి సుబ్బారావు, వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు ఆదిలక్ష్మి, బోరగ శ్రీను, అంగన్‌వాడీ, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

బర్లీ పొగాకు రైతులకు ఆందోళన వద్దు

- ఇన్‌చార్జి కలెక్టర్ గోపాలకృష్ణ

మద్దిపాడు: జిల్లాలో బర్లీ పొగాకు సాగుచేసిన రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వారు నష్టపోకుండా రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుందని ఇన్‌చార్జి కలెక్టర్, జేసీ ఆర్.గోపాలకృష్ణ తెలిపారు. మద్దిపాడు మండలంలోని గార్లపాడు పునరావాస కాలనీ వద్ద గల పొగాకు కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ కొనుగోలు కేంద్రానికి ఎన్ని క్వింటాళ్ల పొగాకు తీసుకొచ్చారు, షెడ్యూల్ ప్రకారం కొనుగోలు చేస్తున్నారా, కొనుగోలు కేంద్రంలో ఏమైనా ఇబ్బందులున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఇచ్చిన పొగాకు బేళ్ల నిల్వలో ఏమైనా ఇబ్బందులున్నాయా అంటూ మార్క్‌ఫెడ్ డీఈ హరికృష్ణను ప్రశ్నించారు. కొనుగోలు అనంతరం నగదు చెల్లింపులు ఏ విధంగా చేస్తున్నారన్న అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత 15 రోజుల నుంచి గార్లపాడు సమీపంలో ఉన్న కొనుగోలు కేంద్రంలో ఇప్పటివరకు జిల్లాలోని 110 మంది పొగాకు రైతుల వద్ద నుంచి మూడు కోట్ల రూపాయల విలువైన 360 మెట్రిక్ టన్నుల పొగాకు కొనుగోలు చేయడం జరిగిందన్నారు. సెప్టెంబర్ నెల వరకు కొనుగోళ్లు జరుగుతాయని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓ లక్ష్మీప్రసన్న, తహసీల్దార్ ఆదిలక్ష్మి, ఏవో స్వర్ణలత మార్క్‌ఫెడ్ డీఈ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శాకంబరీదేవిగా దర్శనమిచ్చిన మాలికాపురోత్తమ


శాకాంబరీదేవి అలంకరణలో..

ఒంగోలు మెట్రో: వారాహి నవరాత్రుల సందర్భంగా ఒంగోలు మంగమూరుడొంక హరిహరసుత అయ్యప్పస్వామి క్షేత్రంలో ఉపాలయంగా ఉన్న శ్రీ మాలికాపురోత్తమ అమ్మవారు బుధవారం ఉదయం శాకంబరీదేవిగా దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు పరాంకుశం చక్రవర్తి, పరాంకుశం రంగా అమ్మవారికి విశేష పంచామృత స్నపన తిరుమంజనంను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మాలికాపురోత్తమ మూలవిరాట్‌ను వివిధ రకాల కూరగాయలు, పండ్లతో శాకంబరీదేవిగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శనం చేసుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

డీఎల్‌డీవోగా ఎంపీడీవోకు అదనపు బాధ్యతలు


ఇన్‌చార్జ్ కలెక్టర్ గోపాలకృష్ణకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సురేష్‌బాబు

సంతనూతలపాడు: ఒంగోలు డివిజన్ డీఎల్‌డీవో ఇన్‌చార్జిగా సంతనూతలపాడు ఎంపీడీవో డి.సురేష్‌బాబుకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆ మేరకు సంతనూతలపాడు మండల స్పెషల్ ఆఫీసర్, జిల్లా పరిషత్ సీఈవో బి.చిరంజీవి ఉత్తర్వులు జారీ చేశారు. డీఎల్‌డీవో ఇన్‌చార్జిగా బుధవారం బాధ్యతలు చేపట్టిన అనంతరం ఒంగోలులోని కలెక్టరేట్లో ఇన్‌చార్జ్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణను మర్యాదపూర్వకంగా సురేష్‌బాబు కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

మొహర్రం సందర్భంగా అన్నదానం


అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే బూచేపల్లి, జెడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ

దర్శి: మొహర్రం పండగ సందర్భంగా పట్టణంలోని జండా చెట్టు వద్ద బుధవారం అన్నదానం చేశారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జెండా చెట్టు వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని అందరికీ మొహర్రం శుభాకాంక్షలు తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

12న శ్రీగిరి గిరి ప్రదక్షిణ

ఒంగోలు మెట్రో: స్థానిక శ్రీగిరిపై కొలువైయున్న వెంకటేశ్వరస్వామికి ఈ నెల 12వ తేదీ గిరి ప్రదక్షిణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు గిరి ప్రదక్షిణ కమిటీ కార్యదర్శి మల్లికార్జునరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

భవిత సెంటర్ తనిఖీ


ఫిజియోథెరపీని పరిశీలిస్తున్న ఎంఈవో-2 పద్మావతి

కొత్తపట్నం: స్థానిక ఎంపీపీ స్కూల్-1లో ఉన్న భవిత సెంటర్‌ను ఎంఈవో-2 ఎం.పద్మావతి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రతి బుధవారం జరిగే ఫిజియోథెరపీని పరిశీలించారు. డాక్టర్ సుధాకర్ అందించే ఫిజియోథెరపీ సేవలను వినియోగించుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు. పాఠశాల హెచ్ఎం సీహెచ్ మస్తాన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.